

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 13-08-2026 సంపుటి : 08 సంచిక 59 పేజీలు : 8 వెల : రూ 3-00


# పన్నుల పరిపాలనలో ఏపీ సరికొత్త సంస్కరణలు..


## ఏఐ టెక్నాలజీపై జీఎస్టీ అధికారుల ప్రశంసలు



అమరావతి, ఆగస్టు 12 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పన్నుల శాఖ సంస్కరణలను జీఎస్టీకౌన్సిల్ సెక్రటేరియట్ అధికారులు ప్రశంసించారు. దేశానికే ఆదర్శంగా ఏపీ ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన ఉందని వ్యాఖ్యానించారు. ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన నమూనా అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్ సీనియర్ అధికారులు సమావేశమయ్యారు. ఏపీసీటీడీలో ఏఐ ఆధారిత రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలను అధికారులు పరిశీలించారు. ఏఐ ఆధారిత న్యాయ కేసుల నిర్వహణ, దర్యాప్తు విధానాలను పరిశీలించారు.ఏఐ డ్యాష్‌బోర్డులు, జీఎస్టీ డేటాతో రియల్‌టైమ్ జీఎస్‌డీపీ (ఊాఆఖ) విశ్లేషణపై అధికారులు అధ్యయనం చేశారు. జీఎస్టీ సువిధ కేంద్రాన్ని సందర్శించి పన్ను చెల్లింపుదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఏఐ ఆధారిత సాంకేతిక ఆవిష్కరణల్లో ఏపీ వాణిజ్య పన్నుల శాఖ పనితీరుపై అధికారులు ప్రశంసల వర్షం కురిపించారు. కేంద్రప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరించిన నమూనాగా ఏపీ ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన ఉందని కొనియాడారు. ఏఐతో పన్నుల ప్రక్రియలు వేగవంతం అవుతాయని వెల్లడించారు.వ్యాపార నిర్వహణ మరింత సులభతరం అవుంతుందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ఆదాయం పెంపుతో పాటు దేశ ఆదాయాల పెరుగుదలకు ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన దోహదం చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఏఐ పన్నుల పరిపాలన విస్తరణకు జీఎస్టీఎన్(ఊూబె) డేటా, సిస్టమ్ ఇంటిగ్రేషన్‌పై కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రంతో డేటా పంచుకునే విధానంలో కేంద్రప్రభుత్వం సహకరించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

# మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

## ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ



న్యూఢిల్లీ,ఆగస్ట్12(: భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# కొందరు ఎమ్మెల్యేల దొంగ సంతకాల నివారణకే ఫొటో రికగ్నైజేషన్: అయ్యన్నపాత్రుడు



అమరావతి, ఆగస్టు 12 : కొందరు ఎమ్మెల్యేల దొంగ సంతకాల నివారణకే ఫొటో రికగ్నైజేషన్ పెట్టామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. ఆరు నెలలుగా అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం వివిధ స్థాయిలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లామని.. తమకు ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో వేచి చూస్తున్నామని వ్యాఖ్యానించారు. అమరావతి వేదికగా మీడియాతో అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. ప్రతిపక్షం అనేది ఒక హోదా... అది సరిపడా సంఖ్యాబలం ఉంటేనే దక్కుతుందని స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాని సభ్యులకు కొత్త ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఫ్లాట్స్ కేటాయించాలా.? అని ప్రశ్నించారు. ఈ విషయంపైనా ప్రభుత్వ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపు జీఏడీపై తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీకి రాని వారు ఎమ్మెల్యేగా ఎందుకని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఒకే లిఫ్ట్ ఉన్నందున పెద్ద వయస్సు ఉన్న వారు కింది అంతస్తులు కోరుకునేవారని ప్రస్తావించారు. అమరావతిలో మాత్రం ఎక్కువ లిఫ్టులు అందుబాటులో ఉండటం, వెంటిలేషన్, కాలుష్యం తక్కువ తదితర కారణాలతో పెద్ద వయస్సు ఎమ్మెల్యేలు పై అంతస్తులను కోరుకుంటున్నారని పేర్కొన్నారు.స్వాతంత్ర్య వేడుకల్లో ప్రజలను భాగస్వామ్యం చేసేలా కార్యక్రమాలు చేపట్టామని అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆగస్టు 14, 15వ తేదీల్లో అసెంబ్లీలో చేసే అలంకరణను ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఎవరైనా వచ్చి అసెంబ్లీ ప్రాంగణాన్ని వీక్షించవచ్చని వివరించారు. పోలీసు బ్యాండ్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలను.. ఆ రెండు రోజుల పాటు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహిస్తామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

# విచారణ, నోటీసు లేకుండా ఓట్లు తొలగించొద్దు: అశోక్‌బాబు

అమరావతి, ఆగస్టు 12 ఓటర్ల జాబితా సవరణలు, సమస్యలపై ఆంధ్రప్రదేశ్ సీఈఓ (అఇూ)ను కలిశానని మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు పేర్కొన్నారు. 175 నియోజకవర్గాల్లోనూ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారని తెలిపారు. అయితే పెండింగ్‌లో ఉన్న 14 నియోజకవర్గాల జాబితా ఈరోజు ఇచ్చారని ప్రస్తావించారు. 44 లక్షల సవరణ నోటీసుల్లో కేవలం 10శాతం మాత్రమే ఇచ్చారని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఈఓకు విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న సవరణల కోసం ఓటర్లను ఎమ్మార్వో/తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిప్పవద్దని కోరారు.బీఎల్‌వోలు నేరుగా గ్రామాలు, వార్డులకు వెళ్లి సమాచారం సేకరించి ఓటర్ జాబితా సవరణలు పూర్తి చేయాలని ప్రతిపాదించామని అశోక్ బాబు తెలిపారు. నూతన ఓటర్ల నమోదు: 01-07-2026 నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై నిబంధనలు: స్పష్టమైన విచారణ, నోటీసు, స్పీకింగ్ ఆర్డర్ లేకుండా ఓట్లను తొలగించవద్దని సూచించారు. సెప్టెంబర్ వరకు సమయం చాలకపోతే కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడిగి ప్రక్రియ గడువును మరో 10 నుంచి15 రోజులు పొడిగించాలని అశోక్ బాబు కోరారు.

# పార్లమెంట్‌లో చర్చకు నేను సిద్ధం: అమిత్‌షా



న్యూఢిల్లీ ,పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారు' అని అన్నారు.అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు?. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు?. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# అమరావతి అభివృద్ధిలో మరో ముందడుగు..

## సీడ్ యాక్సిస్ రోడ్డు, రెండు స్టీల్ బ్రిడ్జిల ప్రారంభం

అమరావతి, ఆగస్టు 12 : అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్డు, రెండు స్టీల్ బ్రిడ్జిలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. అమరావతిలో కీలకమైన 9 లేన్ల రహదారిగా సీడ్ యాక్సిస్ రోడ్డును ప్రభుత్వం నిర్మిస్తుంది. ఈ రోడ్డుకు సెంట్రల్ ఃఖీూతో పాటు ఇరువైపులా 11 మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్లను నిర్మించనుంది. అమరావతిలో ఉత్తరం నుంచి దక్షిణానికి వెళ్లే ఔ1 నుంచి ఔ17 రోడ్లన్నీ సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానం చేయనుంది. దొండపాడు నుంచి తాడేపల్లి వరకు ఔఊ-16కు సీడ్ యాక్సిస్ రోడ్డు అనుసంధానం కానుంది. ఈ రోడ్డు 21.77 కిలోమీటర్ల మొత్తం పొడవు ఉంది. మూడు దశల్లో ఈ రోడ్డును ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంది. ఫేజ్-1లో దొండపాడు నుంచి వెంకటపాలెం మంతెన ఆశ్రమం వరకు 14.35 కిలోమీటర్ల వరకు ఈ రోడ్డును నిర్మించనుంది. ఫేజ్-2లో వెంకటపాలెం నుంచి ఉండవల్లి పాత జాతీయ రహదారి వరకు 3.92 కిలోమీటర్లకు ఈ రోడ్డును విస్తరించనుంది.ఫేజ్-2లో రెండు స్టీల్ బ్రిడ్జిల నిర్మాణాలను ఏపీ సర్కార్ పూర్తి చేయనుంది. ఫేజ్-3లో 3.50 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనుంది. ఉండవల్లిలో బకింగ్‌హామ్ కెనాల్‌పై 110 మీటర్ల స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేయనుంది. కొండవీటి వాగు, గుంటూరు ఛానల్‌పై 280 మీటర్ల స్టీల్ బ్రిడ్జిని ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంది. అమరావతి రహదారి అనుసంధానంలో సీడ్ యాక్సిస్ రోడ్డు కీలకంగా మారనుంది.






# సంపాదకీయం

గురువారం 13-08-2026

## వాయిదాల లోక్‌సభ ? ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి. ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సొరేన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు. పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసలో ప్రదర్శించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.

# ఇండియా-చైనా మధ్య మళ్లీ ఉద్రిక్తత..

## భారత, చైనా బలగాల మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో ఘర్షణ

ఇండియా-చైనాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరు దేశాల సైనికులు సరిహద్దులో పరస్పరం ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దు ప్రాంతం లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) వద్ద గత నెలలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై భారత సైన్యం, ప్రభుత్వం మాత్రం అధికారికంగా స్పందించలేదు. జూలై 26న ఈ



ఘటన జరిగింది. ఇండియా, చైనా బలగాలు సరిహద్దులు సాధారణ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తుండగా పరస్పరం ఎదురుపడ్డారు. అయితే, అక్కడ చైనా సైనికులు ఇంగ్లీషులో ఒక బ్యానర్ ప్రదర్శించడం ఘర్షణకు దారితీసింది. ఇలా వారం రోజులపాటు ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగినట్లు సమాచారం. తర్వాత రెండు దేశాలక చెందిన ఆర్మీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, పరస్పరం చర్చలు జరిపారు. పరిస్థితి సద్దుమణిగేలా చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేనట్లు తెలుస్తోంది. గతంలో కూడా పలుమార్లు ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగిన సంగతి తెలిసిందే. 2017లో డోక్లాం సెక్టార్‌లో ఘర్షణ జరిగింది. ఆ తర్వాత చివరిసారిగా 2020 జూన్‌లో లదాఖ్ వద్ద ఇండియా-చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తిన సంగతి తెలిసిందే. అప్పటి ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. చైనా సైనికులు కూడా బోలెడంత మంది మరణించారు. కానీ, దీనిపై చైనా అధికారికంగా ప్రకటించలేదు. మళ్లీ ఆరు సంవత్సరాల తర్వాత రెండు దేశాల మధ్య ఘర్షణ తలెత్తింది. మరోవైపు చైనా ఇటీవలి కాలంలో ఇండియాను రెచ్చగొట్టే చర్యలకు దిగుతోంది. అరుణాచల్ ప్రదేశ్‌ను తన భూభాగంగా పేర్కొంటూ చైనా మ్యాప్ కూడా రూపొందించింది. అంతేకాదు.. ఇక్కడి ప్రదేశాలకు కొత్త పేర్లు పెట్టింది. కానీ, ఇండియా వీటిని ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ ఇండియాలో భాగమే అంటూ ప్రకటించింది. రెండు రోజులక్రితం కూడా ఇండియా ఇదే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది.

# మణిపూర్‌లో నాగా గ్రామంలో దుండగుల బీభత్సం.. ఇళ్లకు నిప్పు

మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలోని టోక్‌పా లియాంగ్‌మై నాగా గ్రామంలో మంగళవారం రాత్రి సాయుధ దుండగులు దాడికి పాల్పడ్డారు. రాత్రి 9.30 గంటల సమయంలో గ్రామంలోకి ప్రవేశించిన దుండగులు.. పలుమార్లు కాల్పులు జరిపి, అనంతరం ఇళ్లకు నిప్పంటించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు తొమ్మిది ఇళ్లు దగ్ధమైనట్లు వెల్లడించారు. ఎక్కువగా కచ్చా ఇళ్లు కావడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకురావడంలో స్థానికులు సహకరించారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ఆ ప్రాంతంలో అదనపు భద్రతా బలగాలను మోహరించారుఈ దాడిని లియాంగ్‌మై నాగా కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. మరో వర్గానికి చెందిన సాయుధ వ్యక్తులే ఈ దాడికి పాల్పడ్డారని కౌన్సిల్ ఆరోపించింది. దాడిలో 10 ఇళ్లు, ఒక చర్చి కూడా దగ్ధమైనట్లు పేర్కొంది. అమాయక పౌరులు, నివాస గృహాలు, ప్రార్థనా స్థలాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం తీవ్రమైన హింసాత్మక చర్యగా



అభివర్ణించింది. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే గ్రామంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

# ఉద్రిక్తంగా ఇరాన్ వార్..

## నౌకపై హౌతీల దాడి.. కార్గో నౌకపై అమెరికా దాడి..

## ఆరుగురు మృతి

ఇరాన్-అమెరికా యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఇప్పుడీ యుద్ధంలోకి హౌతీలు కూడా చొరబడ్డారు. తాజాగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో ఒక నౌకపై హౌతీలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు మరణించినట్లు యెమెన్ వెల్లడించింది. యెమెన్‌లోని ఉగ్రవాద సంస్థ హౌతీస్. ఈ సంస్థకు ఇరాన్ అండగా ఉంటుంది. అందుకే తాజా యుద్ధంలో ఇరాన్ తరఫున ఈ ఉగ్రవాదులు కూడా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తాము మూడు మిస్సైల్స్ ప్రయోగించినట్లు యెమెన్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో, ఎర్ర సముద్రం వద్ద ఈజిప్టుకు చెందిన తిహమా అనే నౌకపై హౌతీలు మిస్సైల్ దాడి చేశారు. ఈ ఘటనలో నౌకలోని నలుగురు మరణించారు. వీరిలో ముగ్గురు పాకిస్తానీలు, ఒక ఇండోనేసియన్ ఉన్నారు. ఆ తర్వాత ఈ నౌకలోని వారిని రక్షించేందుకు మరో రెస్క్యూ నౌక వచ్చింది. అయితే, ఈ నౌకపై కూడా హౌతీలు దాడి చేశారు. ఈ ఘటనలో మరో రెస్క్యూవర్లు మరణించారు. హౌతీస్ జరిపిన దాడిలో ఇలా ఆరుగురు మరణించారు. అలాగే, ఆయుధాలతో వెళ్తున్న సౌదీ మిలిటరీ నౌకపై కూడా బాబ్ ఎల్-మాండెబ్ వద్ద దాడి చేశామని హౌతీస్ సంస్థ ప్రకటించింది. ఈ దాడిపై సౌదీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు అమెరికా కూడా ఒక కార్గో నౌకపై దాడి చేసింది. పనామాకు చెందిన ఒక కార్గో నౌకకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, దీంతో అమెరికన్ నేవీకి చెందిన ఎంహెచ్60 హెలికాప్టర్ నుంచి రెండు మిస్సైల్స్ ప్రయోగించామని అమెరికా తెలిపింది. ఈ నౌక ఇరాన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ దాడి చేశామని పేర్కొంది. ఇరాన్ పోర్టులకు ఎలాంటి నౌకలు వెళ్లకుండా జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలపై నిషేధం ఉన్నప్పటికీ.. పనామా నౌక వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేశామని తెలిపింది. ఇంకోపక్క.. యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ షరతులకు అంగీకరించే వరకు యుద్ధం కొనసాగుతుందని, హార్మూజ్ జలసంధిని తెరిచేది లేదని ఇరాన్ అంటోంది. దీంతో ఇంకా వార్ కొనసాగుతోంది.



# ప్రతిపక్షాలది అరాచక మనస్తత్వం: బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్


ఢిల్లీ, ఆగస్టు 12: పార్లమెంట్ సమావేశాలను వరుసగా అడ్డుకుంటూ, కీలకమైన ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా విపక్షాలు వ్యవహరిస్తున్న తీరుపై అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రతిపక్షాల ఈ ధోరణి వారి 'అరాచక మనస్తత్వాన్ని' ప్రతిబింబిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. ప్రతిపక్షాల తీరుపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన నితిన్ నబీన్.. నరేంద్ర మోదీ ప్రభుత్వం



ప్రతీ ముఖ్యాంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్షాలు సభను నడవనీయకుండా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రజలందరూ ఈ పరిణామాలను గమనిస్తున్నారని, చర్చల నుంచి ఎవరు పారిపోతున్నారో దేశ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు. మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా విపక్షాల వైఖరిని ఎండగట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎలాంటి చర్చకైనా సిద్ధంగా ఉందని, అయితే ప్రతిపక్షాలు అర్థవంతమైన చర్చలు జరపకుండా గందరగోళం సృష్టించడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. విపక్షాలకు చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే లోక్‌సభ స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని, ఈ (బుధవారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతరాయంగా చర్చ జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. కాగా, గత కొన్ని రోజులుగా పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వంతో సజావుగా సాగడం లేదు. ప్రతిపక్షాలు తమకు నచ్చిన అంశాలపై చర్చకు పట్టుబడుతూ నిరసనలకు దిగుతుండగా, పార్లమెంటరీ నిబంధనల ప్రకారం చర్చల్లో పాల్గొనాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజా ఆరోపణలు, సవాళ్లతో అధికార-ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది.

# నన్ను లుంగీవాలా అంటూ దూషించారు: జాన్ బ్రిట్టాస్


రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా



అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు. 'సభ సభ్యులందరూ సమానమే. ఒక ఎంపీపై ఆరోపణలు వచ్చాయి కాబట్టి వారికి తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాము' అని అన్నారు.

## టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా

న్యూఢిల్లీ, ఆగస్టు 12: టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్ రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల మందే చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి. గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ చైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య



వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి చైర్మన్‌గా వ్యవహరించారు.

# ఇంటెలిజన్స్ వైఫల్యమేనా

## అధికార పార్టీలో అనుమానాలు

కర్నూలు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)కర్నూలులో శాంతి భద్రతల సమస్యలపై మంత్రి టీజీ భరత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఒకవైపు హోం మంత్రి అనిత లా అండ్ ఆర్డర్ బాగుందంటూ చెబుతూ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం రౌడీషీటర్లను పీచమణిచేస్తానని ప్రతి సభలో హుంకరిస్తున్నారు. కానీ చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్న టీజీ భరత్ మాత్రం కర్నూలులో ఇంటలిజెన్స్ తో పాటు అధికార వ్యవస్థ కూడా పూర్తిగా విఫలమయిందని ఆరోపణలు చేయడం సూటిగా కూటమి ప్రభుత్వానికి తాకినట్లయింది. మంత్రి టీజీ భరత్ ఈ వ్యాఖ్యలు ఆయన ఆవేదనలో భాగమయి ఉండవచ్చు. కానీ అది ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే విధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున ప్రత్యర్థులు దానిని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు... కర్నూలులో టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ హత్య ఘటనపై పోలీసుల నిఘా వైఫల్యమంటూ ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు ముందే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. మంత్రుల కదలికలపై నిఘా పెట్టే అధికారులు నేరస్థులపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.పోలీసుల తీరుపై మంత్రి టీజీ భరత్ అసంతృప్తి కర్నూలులో శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నిఘా వ్యవస్థ పనితీరులో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తోందని మండిపడ్డారు.హత్యకు ముందే బాధితుడి ఫొటో పెట్టి సోషల్ మీడియాలో 'ఖీఎఖ' అని పోస్ట్ చేసినా పోలీసులు గుర్తించలేకపోవడంపై అసంతృప్తి వెళ్లి బుచ్చారు.మంత్రులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారనే విషయాలపై ఉండే శ్రద్ధ.. నేరస్థుల కదలికలపై ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు.ఈ ఘటనపై సీఎంను కలిసి ఫిర్యాదు చేస్తానని, రౌడీ మూకల అరాచకాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కర్నూలులో రౌడీలు రెచ్చిపోతున్నారని మంత్రి భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్యలకు తెగబడుతున్నారని మంత్రి భరత్ఇంతియాజ్ హత్య అంటూ వారం క్రితమే సోషల్ మీడియాలో వచ్చిందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలపై వాళ్లు నిఘా పెడుతుంటే..పోలీసులు ఏం చేస్తున్నారంటూ మంత్రి భరత్ ప్రశ్నించడం కూటమి ప్రభుత్వంలోని శాంతి భద్రల సమస్యను ఎత్తి చూపుతుందని విపక్ష వైసీపీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమయిందని, అందుకు తాము కాదని, మంత్రి భరత్ వ్యాఖ్యలే ఉదాహరణ అని చెబుతున్నారు. తన పార్టీ నేత హత్యతో ఆవేదనకు గురైనా మంత్రి టీజీ భరత్ ఆవేదనతో చేసిన వ్యాఖ్యలుగా చూడాలని కూటమిలోని నేతలు సర్దిచెప్పుకుంటున్నా.. అది ప్రభుత్వాన్ని మాత్రం డ్యామేజీ చేసే విధంగా ఉందన్న వ్యాఖ్యలు మాత్రం వినిపిస్తున్నాయి. దీనిపై టీజీ భరత్ ను పార్టీ నాయకత్వం వివరణ కోరే అవకాశాలు లేకపోలేదు.

# బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా


నెల్లూరు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృథా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరకపోగా, న్యాయస్థానంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.న్యాయస్థానంలో ఎదురుదెబ్బలుమెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్‌ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

### ఈడేపల్లిలో ఆక్సిజన్ సిలిండర్ లీకేజ్..

#### రెండు బైక్‌లు, కారు ధ్వంసం

మచిలీపట్నం ఈడేపల్లిలో బెల్ కంపెనీ వెనుక ప్రాంతంలో బుధవారం ఆక్సిజన్ సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా కలకలం రేగింది. లీకేజీ కారణంగా సిలిండర్ అదుపుతప్పి సమీపంలోని ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు ధ్వంసమయ్యాయి.ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది లీకేజీని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.సిలిండర్ లీకేజీతో భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# కోవర్ట్ రాజకీయాలు - టీడీపీ వర్గాల అనుమానాలు




ఒంగోలు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా ముఖ్యంగా ఒంగోలు నియోజకవర్గంలో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి , స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ల మధ్య తలెత్తిన రాజకీయ వైరం తీవ్ర రూపం దాల్చుతోంది. వైఎస్సార్సీపీ ని వీడి జనసేనలో చేరినప్పటి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక ఎమ్మెల్యే దామచర్లను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించడం, దానికి ప్రతిగా దామచర్ల కూడా సవాళ్లు విసరడంతో ఒంగోలు రాజకీయాలు కూటమి వర్సెస్ కూటమి అనే స్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల కుటుంబాల మధ్య రాజకీయ వైరం దశాబ్దాలుగా కొనసాగుతోంది. గతంలో ఇరు నాయకులు ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీపడేవారు. అయితే బాలినేని జనసేన పార్టీలో చేరినప్పటికీ, పాత విభేదాలు మాత్రం వీడలేదు. ఒంగోలుపై తన పట్టు నిలుపుకోవాలని బాలినేని ప్రయత్నిస్తుంటే, సిట్టింగ్ ఎమ్మెల్యేగా పూర్తి ఆధిపత్యం చెలాయించాలని దామచర్ల భావిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం ఒంగోలు రాజకీయాన్ని శాసించడమే కావడంతో ఈ ఘర్షణ వ్యక్తిగత స్థాయికి చేరింది. తాజాగా బాలినేని తన అనుచరులను కాపాడుకునేందుకు నేరుగా రంగానికి దిగారు. స్థానిక పోలీసులు ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిళ్లతో తన వర్గానికి చెందిన వారిపై, జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇసుక, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి కౌంటర్‌గా.. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అక్రమాల నుంచి తప్పించుకోవడానికే బాలినేని జనసేన ముసుగు వేసుకున్నారని, ఒంగోలులో రౌడీయిజం చెల్లదని దామచర్ల విమర్శలు గుప్పించడంతో పరిస్థితి తీవ్రమైంది.జనసేనలో చేరినప్పటికీ బాలినేని వైఎస్సార్సీపీ నాయకులకు మద్దతుగా పనిచేస్తున్నారని, టీడీపీ–జనసేన కూటమిలో చిచ్చు పెట్టేందుకు 'కోవర్ట్'గా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్సీపీ నేతలపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికి , తన పాత కేడర్‌ను కాపాడుకోవడానికి జనసేన జెండాను వాడుకుంటున్నారనే ఆరోపణలు టీడీపీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. నాయకుల మధ్య సాగుతున్న ఈ పోరు సోషల్ మీడియా వార్‌గా మారి, ఇప్పుడు నేరుగా వీధుల్లోకి వచ్చే వాతావరణం కనిపించడం వల్ల టీడీపీ, జనసేన దిగువ స్థాయి కేడర్ తీవ్ర గందరగోళానికి గురవుతోంది. ఎన్నికల్లో కలసి పనిచేసిన రెండు పార్టీల శ్రేణులు ఇప్పుడు పరస్పరం పోలీసు స్టేషన్ల ముందు ధర్నాలు చేయడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం వల్ల ఉమ్మడి క్యాడర్ స్ఫూర్తి దెబ్బతింటోంది.ఒంగోలులో సాగుతున్న ఈ అంతర్గత పోరు కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి నేతలే ఒకరిపై ఒకరు ఇసుక, మద్యం అవినీతి ఆరోపణలు చేసుకోవడం ప్రతిపక్ష వైఎస్సార్సీపీకి అతిపెద్ద రాజకీయ ఆయుధంగా మారింది. ఈ సెగ కేవలం ఒంగోలుకే పరిమితం కాకుండా ప్రకాశం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాకితే, కూటమిలోని టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది.పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో టీడీపీ, జనసేన అధిష్టానాలు త్వరితగతిన స్పందించాయి. ఇరు పార్టీల సీనియర్ నేతలు కలసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, ఇద్దరు నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ విమర్శలు ఆపి, ఏవైనా సమస్యలు ఉంటే సమన్వయ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి – దామచర్ల జనార్ధన్ ల మధ్య పోరు కేవలం ఒక స్థానిక నియోజకవర్గ సమస్య కాదు. స్థానికంగా బలంగా ఉన్న పాత ప్రత్యర్థులు కూటమి గొడుగు కిందకి వచ్చినప్పుడు తలెత్తే సవాళ్లకు ఇది అద్దం పడుతోంది. అధిష్టానాలు వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యక్తిగత ఆధిపత్య పోరు కూటమి ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.మరో వైపు సమన్వయ కమిటీ నాయకులు ఒంగోలు పరిణామాలకు సంబంధించిన వివరాలను సంబంధిత నేతల నుంచి నేరుగా తెలుసుకునేందుకు జూమ్ ద్వారా మాట్లాడారు. ఇరువర్గాల అభిప్రాయాలను విన్న అనంతరం సమస్యలు ఏవైనా ఉంటే పార్టీ వ్యవస్థలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి లేదా కూటమికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం వల్ల రాజకీయంగా ప్రత్యర్థులకు అవకాశం కల్పించినట్లవుతుందని హెచ్చరించారు.నేతలు తమ సమస్యలను పార్టీ అధిష్టానాలు, సమన్వయ కమిటీల దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పాలనలో ముందుకు సాగుతున్న సమయంలో చిన్నపాటి విభేదాలు పెద్ద రాజకీయ అంశాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి బలంగా ఉంటేనే ప్రభుత్వానికి రాజకీయ స్థిరత్వం కొనసాగుతుందని, అందువల్ల వ్యక్తిగత విభేదాల కంటే సమిష్టి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఒంగోలు వివాదంపై తాజా చర్యలతో ఇకపై కూటమి భాగస్వామ్య పార్టీల నేతల మధ్య సమన్వయానికి మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా బహిరంగ విమర్శలకు దూరంగా ఉండి, సమస్యలను అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం స్పష్టంగా ఇచ్చినట్లయింది.

# నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా?

విజయవాడ, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ – నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్‌కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు.అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ – నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్–మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది.వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ – నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారా అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన అనేక అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన సభకు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న పదేపదే తెరపైకి వచ్చింది.ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ కీలక వేదిక కావడంతో ప్రతిపక్ష నాయకుడు సభలో ఉండాలని అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పిన విషయం కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ అంశంపై ఆయన న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయించినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇటీవల వైసీపీ మెగా డీఎస్సీ అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వైసీపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగే అవకాశం కూడా ఉంది.మరోవైపు జగన్ అసెంబ్లీకి గైర్హాజరయ్యే విషయంలో సభ్యుల హాజరుకు సంబంధించిన నిబంధనలు కూడా చర్చలోకి వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే నిబంధనల ప్రకారం సభ్యత్వంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాబోయే సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. 2025 ఫిబ్రవరి 24న జగన్ సభకు హాజరైనట్లు, అనంతరం 2026 ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.జగన్ మరోసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే, ప్రజా సమస్యలపై చర్చించే ప్రధాన వేదికకు ఆయన దూరంగా ఉంటున్నారనే భావన ప్రజల్లో బలపడే అవకాశం ఉంది. ఇది ప్రజా తీర్పును గౌరవించడం లేదన్న అభిప్రాయానికి దారితీసి, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది.

# జనసేనకు మరో మంత్రి పదవి..?

విశాఖపట్టణం, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలోనే ఒకేసారి కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం త్వరలోనే ఏపీ క్యాబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు అమరావతి వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ఈ ప్రక్షాళనలో భాగంగా భాగస్వామ్య పక్షమైన జనసేన పార్టీకి మరో అదనపు మంత్రి పదవి దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జనసేన నుంచి క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తోపాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రులుగా కొనసాగుతుండగా.. ఇప్పుడు నాలుగో బెర్త్ ఎవరికి దక్కుతుందనే అంశంపై కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.ఈసారి దక్కబోయే అదనపు మంత్రి పదవిని ఉత్తరాంధ్ర రీజియన్‌కు కేటాయించాలని కూటమి పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. జనసేన కోటాలో రాబోయే ఈ కొత్త పదవితో ఉత్తరాంధ్రకు లభించనున్న నాలుగో మంత్రి పదవిగా ఇది నిలవనుంది. ముఖ్యంగా ఈ మంత్రి పదవి రేసులో బీసీ వర్గాలకు పెద్దపీట వేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మంత్రి పదవి రేసులో ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో ఒకరు అనకాపల్లి నుంచి గెలిచిన సీనియర్ నేత కొణతాల రామకృష్ణ కాగా.. మరొకరు విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్. అయితే, ఉత్తరాంధ్రలో అత్యంత బలమైన సామాజికవర్గంగా ఉన్న గవర వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఆ వర్గానికి చెందిన సీనియర్ లీడర్ కొణతాల రామకృష్ణకే మంత్రి పదవి దక్కే అవకాశాలు అత్యధికంగా ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.ఆయనకున్న రాజకీయ అనుభవం, సీనియారిటీ కూడా దీనికి ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పేరు కూడా గట్టిగా పరిశీలనలో ఉన్నప్పటికీ, సామాజిక సమీకరణాలు మరియు ప్రాంతీయ బలోపేత వ్యూహాల ప్రకారం కొణతాల రామకృష్ణ వైపే అధిష్ఠానం మొగ్గు చూపవచ్చని అంటున్నారు.

# నెరవేరనున్న ప్రకాశం వాసుల కల

ఒంగోలు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)కరువు కోరల్లో చిక్కుకుని, తాగడానికి చుక్క నీరు లేక, ఫ్లోరైడ్ రక్కసితో అల్లాడిపోతున్న పశ్చిమ ప్రకాశం (కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా) ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఈ నెలాఖరులోనే కృష్ణా జలాలను విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వర్షాధారం మినహా మరే ఇతర నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో త్వరలోనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుండటంతో స్థానిక రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీశైలం సమీపంలోని కృష్ణానది కొల్లంవాగు నుంచి నీటిని తరలించేందుకు నల్లమల కొండల్లో నిర్మించిన 18.8 కిలోమీటర్ల పొడవైన రెండు సమాంతర సొరంగాల్లో.. రెండో సొరంగానికి సంబంధించిన చివరి విడత లైనింగ్ పనులు ప్రస్తుతం ముగింపు దశకు వచ్చాయి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీలోగా ఈ మిగిలిన పనులన్నింటినీ పూర్తి చేసేలా అధికారులు డే అండ్ నైట్ కష్టపడుతున్నారు. ఈ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడంపైనే నీటి విడుదల ఆధారపడి ఉంది.ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో ప్రస్తుతం శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా మారింది. జూరాల నుండి వస్తున్న ఈ వరద నీటిని పక్కాగా వాడుకుని, నల్లమల సాగర్ కాలువ ద్వారా నీటిని వదిలేందుకు లీన్ పీరియడ్ ప్లాన్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది.

# ఆలయానికి కొత్త శోభ--

## పెయింటింగ్ పనులకు భక్తుల సహకారం కోరుతున్న దేవస్థానం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12: నంద్యాల తెలుగు పేటలోని శ్రీ ఘన మద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో ఆలయ ఆధునీకరణ పనుల్లో భాగంగా పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఆలయానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకురావడంతో పాటు భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పనులు చేపడుతున్నారు. పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు దాతలు, భక్తులు ముందుకు వచ్చి ధన, వస్తు రూపంలో సహకరించాలని దేవస్థానం నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. స్వామివారి ఆలయ అభివృద్ధిలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు.

# సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం--

## స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల ఆర్.కే. ఫంక్షన్ హాల్‌లో నంద్యాల ముస్లిం జేఏసీ, ఎం.బి.టి. ఫౌండేషన్, ఆల్ మేవా ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్య్ర సమరయోధుల అరుదైన చిత్రపటాల ప్రదర్శనను మంత్రి తిలకించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మిర్జా షంషీర్ బేగ్, నివర్తి వెంకట సుబ్బయ్య, ఖాదర్‌బాద్ నర్సింగరావు తదితరుల త్యాగాలను స్మరించుకున్నారు. సమరయోధుల చరిత్రను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మరుగునపడిన సమరయోధుల చరిత్రను సేకరించి చిత్రపటాల రూపంలో ప్రజలకు అందిస్తున్న చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహ్మద్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు--

## చాబోలులో ఆత్మ క్షేత్ర దినోత్సవం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12-నంద్యాల మండలం చాబోలు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. నాలుగు ఎకరాల్లో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, జొన్న, మొక్కజొన్న, జీలుగ, ఆముదం, కూరగాయలు, ఆకుకూరలు తదితర 30 రకాల విత్తనాలను ఎకరానికి 16 కిలోల చొప్పున విత్తారు. 45 రోజుల అనంతరం పచ్చిరొట్ట పంటను భూమిలో కలియదున్నారు. 55 చదరపు అడుగుల విస్తీర్ణంలో 88.9 కిలోల పచ్చిరొట్ట లభించగా, ఎకరానికి సుమారు 4,460 కిలోల పచ్చిరొట్ట ఎరువు లభించినట్లు తెలిపారు. దీనివల్ల భూసారం, కర్బన శాతం పెరిగి రసాయన ఎరువులు, పురుగుమందుల ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ డీఎం శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు జయప్రకాష్‌రెడ్డి, ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఝాన్సీ, సంజీవ్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# 102 తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12-ప్రసవం అనంతరం తల్లి, శిశువులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు 102 తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. బుధవారం నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సేవలను మంత్రి ఫరూక్, కలెక్టర్ జి. రాజకుమారి ప్రారంభించారు. అనంతరం ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాకు మొత్తం 19 వాహనాలు కేటాయించగా, ప్రస్తుతం 11 వాహనాలు అందుబాటులోకి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో 8 నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్ ఆసుపత్రులకు ఒక్కొక్కటి కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన వాహనాలను అందుబాటులోకి వచ్చిన వెంటనే ఇతర ఆసుపత్రులకు కేటాయిస్తామన్నారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోజుకు సగటున 8 నుంచి 10 ప్రసవాలు, నెలకు సుమారు 300 ప్రసవాలు జరుగుతున్నాయని, రోజూ 1,400 నుంచి 1,500 మంది ఓపీ సేవలు పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. తల్లి, బిడ్డల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న 102 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి, కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ భావనతో కర్నూలులో సైకిల్ ర్యాలీ

## ఆగస్టు 13, 14, 15 తేదీల్లో ప్రతి ఇంటా త్రివర్ణం

## మొక్కలు నాటుతూ దేశ సేవకు పిలుపు

కర్నూలు, ఆగస్టు 12: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రీడాస్ఫూర్తి, శారీరక దారుఢ్యం (ఫిట్‌నెస్), బాధ్యతాయుత పౌరసత్వంపై అవగాహన కల్పించే లక్ష్యంతో యూత్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మరియు సెట్కూరు , కర్నూలు ఆధ్వర్యంలో బుధవారం కర్నూలులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్ డా. ఏ. సిరి ఆదేశాల మేరకు, సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ , జిల్లా క్రీడల అధికారి భూపతి రావు మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి శ్రీ కార్తికేయ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైకిల్ ర్యాలీలో యువత, క్రీడాకారులు, విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ పతాకాలను చేతబూని సైకిళ్లపై ర్యాలీ నిర్వహిస్తూ దేశభక్తి, జాతీయ సమైక్యత, ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రతి ఇంటా త్రివర్ణంఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆగస్టు 13, 14, 15 తేదీల్లో ప్రతి పౌరుడు తమ ఇళ్లపై, వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు మరియు ఇతర సంస్థల వద్ద జాతీయ పతాకాన్ని గౌరవంగా ప్రదర్శించి దేశం పట్ల తమ దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా త్రివర్ణం ? ప్రతి హృదయంలో దేశభక్తి" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. మొక్క నాటి ? దేశ భవిష్యత్తును కాపాడుదాంఆగస్టు 14న ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అధికారులు సూచించారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. "దేశానికి నేను ఎలా సేవ చేయగలను?" ? మీ సందేశాన్ని పంచుకోండిప్రతి పౌరుడు "నేను నా దేశానికి ఎలా సేవ చేయగలను?" అనే అంశంపై చిన్న వీడియోను రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. దేశ సేవ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, రక్తదానం, విద్య, క్రీడలు, ఆరోగ్యం, ట్రాఫిక్ నియమాల పాటింపు, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహం, ఇతరులకు సహాయం చేయడం, సమాజ అభివృద్ధి వంటి అంశాలపై తమ సందేశాలను వీడియో రూపంలో పంచుకోవచ్చని తెలిపారు.



# విద్యా కాషాయీకరణకు, విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలి..

## దేవనకొండలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

దేవనకొండ:- విద్యా కాషాయకరణకు వ్యతిరేకంగా, విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు జి. జనార్దన్ పిలుపునిచ్చారు. బుధవారం దేవనకొండలో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ముందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు వి.నరేష్ ఏఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... 1936 ఆగస్టు 12న లక్నోలో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్, భారతదేశంలో ఏర్పడిన మొట్టమొదటి జాతీయ విద్యార్థి సంఘమని గుర్తుచేశారు. దేశ స్వాతంత్య్ర పోరాటం నుండి నేటి వరకు విద్యార్థుల హక్కుల సాధన కోసం, విద్యా పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ వీరోచిత పోరాటాలు చేసిందని కొనియాడారు. "చదువు – పోరాటం" అనే ఆదర్శ నినాదంతో కోట్లాది మంది విద్యార్థులలో సామాజిక చైతన్యం నింపిందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యా వ్యాపారీకరణ వేగంగా జరుగుతోందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య దూరమయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని, అందరికీ సమానమైన, ఉచిత మరియు శాస్త్రీయ విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ, హాస్టల్ వసతులు, స్కాలర్‌షిప్‌ల సకాలంలో విడుదల వంటి విద్యార్థి సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. నేటి తరం విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ చారిత్రక స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని విద్యా హక్కుల పరిరక్షణకు, ప్రజాస్వామ్య సూత్రాల పరిరక్షణకు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, భాస్కర్, మండల నాయకులు రవితేజ తదితరులు పాల్గొన్నారు.




# పీహెచ్సీల్లో వైద్య సేవలు మెరుగుపరచాలి-



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12: జిల్లాలోని పీహెచ్సీ కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై డీఎంహెచ్ఓ వెంకటరమణతో కలిసి ఆమె సమీక్షించారు. పీహెచ్సీల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటంతో పాటు అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రుల పరిశుభ్రత, మౌలిక వసతులు, రోగ నిర్ధారణ పరీక్షలు, అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల్లో వెనుకబడిన లక్ష్యాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్ణీత సమయంలో సాధించాలని ఆదేశించారు. సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్‌లో మంత్రి ఫరూక్ తనిఖీ--

## నాణ్యత, పరిశుభ్రతపై ఆరా--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12-: ప్రభుత్వ ఆసుపత్రి పర్యటనలో భాగంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆసుపత్రి ప్రాంగణంలోని అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఆహార నాణ్యత, వంటగది పరిశుభ్రతను పరిశీలించారు. భోజనం చేస్తున్న సామాన్యులు, రోగుల బంధువులతో మాట్లాడి ఆహారం రుచి, నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పేదలు, దినసరి కూలీలు, రోగుల బంధువులకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో అన్నా క్యాంటీన్లు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# నంద్యాల నటుడి పళ్ళ బురుసు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12-నంద్యాల వాసి, కళారాధన సాంస్కృతిక సంస్థ నిర్వాహక కార్యదర్శి, ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటుడు ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్ ముఖ్య పాత్రలో నటించిన 'పళ్ళ బురుసు' చిత్రం ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ తరఫున అక్కినేని నాగార్జున నిర్మించిన ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నాలుగు దశాబ్దాలుగా రంగస్థల నటుడిగా గుర్తింపు పొందిన ప్రసాద్‌కు నంది, కళారత్న, కందుకూరి రంగస్థల పురస్కారాలు లభించాయి. ఇటీవల టీవీ సీరియళ్లు, సినిమాల్లోనూ నటిస్తున్నారు. కుటుంబ అనుబంధాలు, హాస్యం, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం విజయవంతం కావాలని కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ ఆకాంక్షించారు. నంద్యాలలో నిధి సినిమా థియేటర్‌లో ఉదయం, మధ్యాహ్నం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**